సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
ఆదివారం । 19 । మార్చి । 2023





## పెళ్లి ఇంట విషాదం
శుక్రవారం కూతురు పెళ్లి వైభవంగా జరిపించారు. అనంతరం అమ్మాయి తల్లి ఉదయం గుండెపోటుతో మృతి చెందింది.
- 8లో▸



## అనాథలను కదిలిస్తే కన్నీళ్లే..!
నా అనే వాళ్లు లేక కొందరు.. ఉన్నా పట్టించుకోని వారు మరికొందరు.. కారణమేదైనా జీవితం చివరి దశలో పండుటాకులు ఆశ్రమంలో కాలం వెళ్లదీస్తున్నారు.
- 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
$25^0/20^0$

## వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### పోలీస్‌స్టేషన్ భవనాన్ని పరిశీలించిన ఎస్పీ



టేకుమట్ల: మండల కేంద్రంలో నిర్మిస్తున్న పోలీస్‌స్టేషన్ భవనాన్ని ఈనెల 25న ప్రారంభించనున్న నేపథ్యంలో ఎస్పీ సురేందర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు తగు సలహాలు, సూచనలు అందించారు. ఆయన వెంట డీఎస్పీ రాములు, సీఐ వేణుచందర్, ఎస్‌ఐ చల్ల రాజు, ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, జెడ్పీటీసీ పొలాల సరోత్తంరెడ్డి, ఎంపీటీసీ ఆదిరఘు ఉన్నారు.

### రేపు ఆయుర్వేద వైద్యశిబిరం
భూపాలపల్లి అర్బన్: సింగరేణి ఆధ్వర్యంలో ఈ నెల 20న ఏరియాలోని కృష్ణకాలనీ మినీ ఫంక్షన్‌హాల్‌లో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఏరియా అధికార ప్రతినిధి తుకారం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో సింగరేణి కార్మికులు, స్థానికులకు ఆయుర్వేద వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దీర్ఘకాలిక వ్యాధులైన షుగర్, బీపీ, మోకాళ్ల నొప్పులకు పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

### 64మంది గైర్హాజరు
భూపాలపల్లి అర్బన్: శనివారం నిర్వహించిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు జిల్లావ్యాప్తంగా 64మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి దేవరాజం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1,809మంది విద్యార్థులకు గాను 1,745మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు.

### మున్సిపాలిటీ టీపీఓగా సునిల్‌కుమార్



భూపాలపల్లి: భూపాలపల్లి మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్(టీపీఓ)గా పెరుమాండ్ల సునిల్‌కుమార్‌ను నియమిస్తూ శనివారం డైరెక్టర్ ఆఫ్ టౌన్-కంట్రీ ప్లానింగ్ కె.విద్యాసాగర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన నర్సంపేట టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తుండగా టీపీఓగా పదోన్నతి కల్పించి భూపాలపల్లికి కేటాయించారు. ఇక్కడ పని చేస్తున్న పూజారి అవినాష్‌ను గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్‌కు డిప్యుటేషన్‌పై బదిలీ చేశారు. ఈ మేరకు సునిల్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

### 22న పంచాంగ శ్రవణం
కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయంలో ఈనెల 22న బుధవారం సాయంత్రం 4.30గంటలకు నూతన పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని ఆలయ వేదపండితులతో నిర్వహిస్తున్నట్లు ఈఓ మహేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు తరలివచ్చి పంచాంగ శ్రవణం అనంతరం తీర్థప్రసాదాలు తీసుకోవాలని కోరారు.

**24న హుండీ లెక్కింపు**

శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంతో పాటు అనుబంధ దేవాలయాల్లో హుండీలను ఈనెల 24న ఉదయం 10గంటలకు లెక్కించనున్నట్లు ఈఓ మహేష్ ఒక ప్రకటనలతో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

### మత్స్యకారులకు వృత్తి నైపుణ్య పరీక్షలు



టేకుమట్ల: వృత్తి నైపుణ్యత పరీక్షల్లో భాగంగా టేకుమట్ల మండల కేంద్రంలోని కొత్త చెరువులో మత్స్యశాఖ ఆధ్వర్యంలో మత్స్యకారులకు శనివారం వృత్తి నైపుణ్యత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాష్ మాట్లాడారు. మండలంలోని ఆకినేపల్లి, ఎంపేడు, రామకృష్ణాపూర్(టి), రామకృష్ణాపూర్(వి) వెలిసాల, పంగిడిపల్లి, కుందనపల్లి గ్రామాల మత్స్యకారులకు అర్హత పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. 87మంది అర్హత సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా మత్స్యశాఖ అధికారి పిల్లి శ్రీపతి, సిబ్బంది, జిల్లామత్స్యశాఖ సహకార సంఘం నాయకులు శ్రీపతి, గ్రామాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

# కిట్లు లేవు.. నగదు లేదు..

- ఇబ్బంది పడుతున్న కేజీబీవీ విద్యార్థినులు
- కరోనా తర్వాత ఆరోగ్య కిట్ల పంపిణీ బంద్..
- అమలుకు నోచుకోని నగదు బదిలీ



కాటారం కేజీబీవీ పాఠశాల

కాటారం: కేజీబీవీల్లో చదివే బాలికలకు ఆరోగ్యపరంగా వచ్చే మార్పులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఐదేళ్ల కిందట ఆరోగ్య కిట్ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ప్రతి మూడు నెలలకు ఒకసారి విద్యార్థినులకు ఆరోగ్య కిట్లను అందజేసేలా ప్రణాళిక రూపొందించారు. ప్రారంభంలో రెండేళ్ల పాటు కిట్ల పంపిణీ సక్రమంగానే కొనసాగినప్పటికీ కరోనా తర్వాత నిలిచిపోయింది. దీంతో విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థినులు నిరుపేదలు కావడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. కొబ్బరినూనె, బాతింగ్ సోప్స్, డిటర్జెంట్ సబ్బులు, రుతురుమాళ్లు సొంతగా డబ్బులు పెట్టి కొనుగోలు చేయలేకపోతున్నారు.

**నెరవేరని నగదు బదిలీ..**

ఆరోగ్య కిట్ల పంపిణీలో తలెత్తుతున్న పలు కారణాలతో ప్రభుత్వం కిట్ల పంపిణీని నిలిపేసింది. కిట్ల స్థానంలో విద్యార్థినుల బ్యాంకు ఖాతాలో నెల నెల రూ.100 జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో అధికారులు విద్యార్థినులతో బ్యాంకు ఖాతాలు తెరిపించి వివరాలను సంబంధిత శాఖకు అందజేశారు. రెండేళ్లు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు ఖాతాల్లో డబ్బులు జమకాలేదు. ప్రభుత్వం గతంలో కాస్మొటిక్ చార్జీల కింద ఒక్కో విద్యార్థినికి నెలకు రూ.వంద చొప్పున ఇచ్చేది. వీటితో కొబ్బరినూనె, బాతింగ్ సోప్స్, డిజర్జెంట్ సబ్బులు మొదలైన వస్తువులను విద్యార్థినులు కొనుగోలు చేసుకునేవారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మూడు నెలలకు ఒకసారి రూ.300 విలువ చేసే ఆరోగ్య కిట్లు అందజేస్తూ వచ్చింది. అందులో కొబ్బరినూనె, సబ్బులు, రిబ్బన్లు, పౌడర్, శానిటేషన్ న్యాప్‌కిన్లు తదితర 15రకాల వస్తువులు అందజేశారు. కోవిడ్–19కి ముందు వరకు వీటిని సక్రమంగా పంపిణీ చేశారు. కోవిడ్ తదనాంతరం పాఠశాలలు తెరుచుకున్నా ఆరోగ్య కిట్ల పంపిణీ నిలిపివేశారు.

**జిల్లాలో 2650 మందికి..**

జిల్లాలో 11 మండలాలు ఉండగా 11 కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలు, ఒక అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల ఉంది. 11 కేజీబీవీల్లో 2,650మంది విద్యార్థినులు చదువుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి విద్యార్థినికి సంబంధించిన ఖాతా వివరాలను అందజేసినప్పటికీ ఇప్పటి వరకు ఖాతాల్లో మాత్రం డబ్బులు జమకాలేదు.

**కిట్లు అందడం లేదు..**



ఆరోగ్య కిట్లు అందడం లేదు. డబ్బులు బ్యాంకు ఖాతాలో వేస్తామని ఖాతా నంబర్లు తీసుకొన్నారు. కానీ రెండేళ్లుగా వేయడం లేదు. కాస్మొటిక్స్ కొనుక్కోవడానికి డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కిట్లు లేదా డబ్బులు ఏదో ఒకటి అందజేస్తే మాకు ఉపయోగంగా ఉంటుంది.

- అనుష్క, విద్యార్థిని, కాటారం

**ఖాతా వివరాలు పంపించాం..**

కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మూడు నెలలకు ఒకసారి ఇచ్చే ఆరోగ్య కిట్ల స్థానంలో వారి బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేయడం కోసం అకౌంట్ నంబర్లను సేకరించి పంపించాం. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా కూడా ఆరోగ్య కిట్లకు సంబంధించిన నగదు విద్యార్థినుల ఖాతాలో జమకాలేదు. సమావేశాల్లో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం.

- కిషన్, ఇన్‌చార్జ్ జీసీడీఓ

# వడగళ్ల బీభత్సం

గణపురం/మొగుళ్లపల్లి: శనివారం రాత్రి గణపురం, మొగుళ్లపల్లి మండలాల్లో వడగండ్ల వాన కురిసింది. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వడగళ్ల వానకు గణపురం మండలకేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాలు తల్లడిల్లాయి. వందల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు సమాచారం. పంటలు, రోడ్లను వడగళ్లు మంచు మాదిరిగా కప్పేశాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో చీకటిమయమైంది. వీధులన్నీ నీటితో నిండిపోయాయి. దీంతో ప్రజలు బయటకు వెళ్లలేక ఇళ్లలోనే బిక్కుబిక్కుమంటున్నారు. పంటలు దెబ్బతిన్నట్లు పలువురు రైతులు తెలిపారు.



గణపురంలో కురిసిన వడగళ్లు



నీటితో నిండిన ఇల్లు →

# క్రీడలతో మానసికోల్లాసం

- ఘనంగా క్రీడా దినోత్సవం

భూపాలపల్లి అర్బన్: క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు చెప్పారు. భూపాలపల్లి ఏరియా సింగరేణి 22వ వార్షికోత్సవ కార్యక్రమం శనివారం అంబేడ్కర్ క్రీడామైదానంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కోల్ ఇండియా స్థాయిలో జరిగిన క్రీడా పోటీలలో మెడల్స్ సాధించిన క్రీడాకారులను, వివిధ పోటీలలో అత్యధిక బహుమతులు గెలుచుకొని ఏరియా చాంపియన్‌గా నిలిచిన సింగరేణి క్రీడాకారులను సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. భూపాలపల్లి ఏరియాలో క్రీడాకారులకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. సింగరేణిలో కారుణ్య నియామకాల్లో యువకులు ఎక్కువ మంది వస్తున్నారన్నారు. క్రీడల పట్ల ఆసక్తి చూపి క్రీడలలో పాల్గొని భూపాలపల్లి ఏరియాకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. క్రీడలు ప్రతి వ్యక్తికి అవసరమని, క్రీడల వలన ఎలాంటి రోగాలు రావని ఆరోగ్యంగా.. చాలా చురుకుగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు తుకారం, శివకేశరావు, సురేఖ, రాజు, నాయకులు బడితల సమ్మయ్య, చంద్రమౌళి, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, కోఆర్డినేటర్ పాక శ్రీనివాస్, క్రీడాకారులు, కార్మికులు పాల్గొన్నారు.



క్రీడాకారులను సన్మానిస్తున్న జీఎం, నాయకులు

# స్కాముల తెలంగాణ

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి
- కలెక్టరేట్ ముట్టడించిన బీజేపీ శ్రేణులు



కలెక్టర్ కార్యాలయం ఆవరణలో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

భూపాలపల్లి రూరల్: బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం స్కాముల తెలంగాణగా మారిందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీపై పార్టీ పిలుపుమేరకు శనివారం బీజేపీ శ్రేణులు కలెక్టరేట్‌ను ముట్టడించారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కీర్తిరెడ్డితో పాటు మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల సునీల్ రెడ్డిని నాయకులను, కార్యకర్తలను పోలీసులు అరెస్టుచేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కీర్తిరెడ్డి మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఏర్పడ్డ తెలంగాణలో పాలన పక్కదారి పట్టిందన్నారు. స్వరాష్ట్ర పాలన కంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనే బాగుందని చెప్పారు. కేసీఆర్ పాలనలో నిరుద్యోగులు, ఉద్యోగులు, విద్యార్థులు, రైతులు, కార్మికులు సామాన్యులు బాధ పడుతున్నారని తెలిపారు. 2011లో గ్రూప్– 1 పరీక్ష జరిగితే 2016లో రీ ఎగ్జామ్ జరిగిందన్నారు. 2015లో సింగరేణిలో ఉద్యోగాల అమ్మకం ఎలా జరిగిందో తెలంగాణ ప్రజలకు, కార్మికులకు తెలసన్నారు. తెలంగాణ ఏర్పడ్డ నాటి నుంచే అవినీతి, అక్రమాలతోనే ఉద్యోగ నియామకాలు జరుగుతున్నాయన్నారు. నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకూ బీజేపీ అండగా ఉంటుందన్నారు. మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్ సునీల్‌రెడ్డి మాట్లాడుతూ పేపర్ లీకేజీ కుట్రలను అరికట్టలేని విద్యాశాఖమంత్రి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కన్నం యుగందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరుకల గణపతి, అర్బన్ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, నాయకులు బట్టు రవి, తిరుపతిరావు, విజయరెడ్డి, దొంగల రాజేందర్, శశికుమార్, మహేష్ భగవాన్, కిరణ్, శంకర్ పాల్గొన్నారు.

# బీజేపీతో దేశానికే ప్రమాదం

- ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తున్న కేంద్రం
- 700మంది రైతులు చనిపోయాక చట్టాల రద్దు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- మతాల పేరిట విద్వేషాలు, అల్లర్ల సృష్టి
- ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



సభకు హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు



సభలో మాట్లాడుతున్న భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి: జర్మనీలో హిట్లర్ మాదిరిగా పీఎం నరేంద్రమోదీ వ్యవహరిస్తున్నారని, బీజేపీతో దేశానికి అత్యంత ప్రమాదకరమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జన చైతన్య బస్సు యాత్ర శనివారం భూపాలపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి బందు సాయిలు ఆధ్వర్యంలో పట్టణంలోని హనుమాన్ దేవాలయం నుంచి మున్సిపాలిటీ గ్రౌండ్ వరకు నాయకులు, కార్యకర్తలు డప్పు చప్పుళ్లు, బోనాలు, కళాకారులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగసభలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డితో కలిసి వీరభద్రం మాట్లాడారు. బీజేపీ తొమ్మిదేళ్లుగా అన్ని వర్గాల ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తుందన్నారు. ఆ పార్టీ రాష్ట్రంలో కాలు పెట్టకుండా ఉండేందుకే యాత్ర చేపట్టినట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 45 సభలు నిర్వహించి కేంద్రం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తామన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారని, తొమ్మిదేళ్లలో 18కోట్ల ఉద్యోగాలు కాదు కదా ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. పైగా ప్రభుత్వ సంస్థలన్నింటినీ అదానీకి అమ్ముకుంటూ వస్తున్నారన్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేసి, వారి భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకని రైతు వ్యతిరేక చట్టాలు తీసుకొచ్చేందుకు ప్రయత్నించారని, 700మంది అన్నదాతలు చనిపోయాక ఆ చట్టాలను రద్దు చేశారని గుర్తుచేశారు. మతాలు, కులాల పేరిట దేశంలో కల్లోలం సృష్టిస్తున్నారని ఆరోపించారు. సిద్ధాంతాల పేరిట దేశాన్ని రావణకాష్టంలా మార్చారన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో రైతులకు ఉచితంగా విద్యుత్ అందించారన్నారు. సీఎంలు కేసీఆర్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా అదే పంథాలో వెళ్తున్నారని, వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించేందుకు కేంద్రం తీవ్రంగా ప్రయత్నిస్తుందని అన్నారు.

**కేంద్రానికి భయపడేది లేదు..**
**గండ్ర వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్యే**

తెలంగాణ ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తుందని, కేంద్రం విధానాలకు భయపడేవారు ఇక్కడ లేరని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. బీజేపీని గద్దె దింపేందుకు ప్రజాస్వామ్య వాదులంతా ఏకమై ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థలను అదానికి అప్పగించి తొమ్మిదేళ్లలో అతడిని ప్రపంచ కుబేరుడిగా మార్చిందన్నారు. కేంద్ర విధానాలను ప్రశ్నించినందునే సీఎం కేసీఆర్‌పై కక్ష పెంచుకొని చివరకు ఎమ్మెల్సీ కవితపై ఈడీ దాడులు చేపిస్తున్నారని అన్నారు. త్వరలోనే పోడుదారులకు పట్టాలు అందజేస్తామని వెల్లడించారు. ఈ బహిరంగ సభలో సీపీఎం కేంద్ర, రాష్ట్ర నాయకులు జి.నాగయ్య, చెరుపల్లి సీతారాములు, జె.వెంకటేష్, బస్సు యాత్ర టీం లీడర్ పోతినేని సుదర్శన్‌రావు, సీపీఐ నాయకులు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

# అభ్యంతరకర పోస్టులు పెడితే చర్యలు

- డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి

కాటారం: సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా, వ్యక్తులను కించపరిచే విధంగా సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టింగులు పెడితే చట్టపరమైన చర్యలు తప్పవని కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. కాటారం మండలకేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. కొన్ని రోజులుగా ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, ఇన్‌స్టాగామ్‌లలో కొందరు వ్యక్తిగతంగా విమర్శలు చేస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా పోస్టులు పెడుతున్న వ్యవహారంపై పోలీస్‌శాఖ తీవ్రంగా పరిగణిస్తుందన్నారు. ఒక వ్యక్తిని, ప్రజాప్రతినిధిని, ఒక వర్గాన్ని, ఒక పార్టీని, సంఘాన్ని, మతాన్ని, ప్రభుత్వాన్ని కించపరిచే, రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడితే ప్రజల్లో ఉన్న సామరస్యానికి భంగం కలిగి ఘర్షణ వాతావరణం నెలకొంటుందని పేర్కొన్నారు. అటువంటి వాటికి పాల్పడే వారిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులపై కించపరిచే వ్యాఖ్యలు చేయడం అనుమతిలేకుండా మహిళల ఫొటోలు షేర్ చేసినా నేరమే అవుతుందని తెలిపారు. కాటారం సబ్ డివిజన్ పరిధిలోని వాట్సాప్ గ్రూపులపై పోలీస్ నిఘా ఉందని.. ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదని డీఎస్పీ హెచ్చరించారు. కేసుల పాలై జీవితాలు నాశనం చేసుకోవద్దని సాంకేతిక పరిజ్ఞానాన్ని, సోషల్ మీడియాను మంచికోసం వినియోగించుకోవాలని సూచించారు. డీఎస్పీ వెంట సీఐ రంజిత్‌రావు, ఎస్సై శ్రీనివాస్ ఉన్నారు.

# కంకవనాన్ని నరికిన అటవీశాఖ అధికారులు

ఏటూరునాగారం: కంచె చేనును మేసినట్లు ఉంది అటవీశాఖ అధికారుల పనితీరు. అడవిని సంరక్షించాల్సిన అధికారులే వారి అవసరాల నిమిత్తం కంకవనాన్ని నరికివేయడం గమనార్హం. అటవీశాఖ పరిధిలోని నర్సరీలో మొక్కలు ఎదిగేందుకు సపోర్ట్‌గా పెట్టే కర్రల కోసం ఏటూరునాగారం అటవీశాఖ రేంజ్ కార్యాలయం పరిధిలోని అడవిలో కంకవనాన్ని అటవీశాఖ అధికారులు ఎలాంటి అనుమతులు లేకుండా నరికివేసి తరలించారు. కన్నాయిగూడెం మండలం చిట్యాల ప్రాంతం నుంచి శుక్రవారం అర్ధరాత్రి ట్రాక్టర్‌లో ఏటూరునాగారం రేంజ్‌కు తరలించారు. వెదురుకర్రలను నర్సరీలో నిల్వ చేయడం గమనార్హం. కొన్ని మొక్కలను కాపాడేందుకు మరికొన్ని మొక్కలను నరికివేయడం వివాదంగా మారింది. మొక్కలకు సపోర్ట్ కోసం నిబంధనల ప్రకారం అటవీశాఖ పరిధిలోని డిపోల్లో నిల్వ ఉన్న వాటిని వేలం పాట ద్వారా కొనుగోలు చేసి తెచ్చుకోవాల్సి ఉంది. కానీ, అలా కాకుండా అడవిలోని చెట్లను నరికి నర్సరీకి తరలించడం, వాటికి బిల్లులు పెట్టుకునేందుకు అటవీశాఖ అధికారులు సిద్ధమయ్యారు. దీనివల్ల అడవిలోని చెట్లు అంతరించిపోవడంతోపాటు ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని వనప్రేమికులు కోరుతున్నారు.



అటవీశాఖ అధికారులు కన్నాయిగూడెం అడవిలోనుంచి నరికి తెచ్చిన కంకకర్రలు

# చట్టాలపై నేడు అవగాహన సదస్సు

మొగుళ్లపల్లి: మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో నేడు (ఆదివారం) జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి జయరాంరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన అవసరం

ఎస్‌ఎస్‌తాడ్వాయి: పాఠశాలల్లోని విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలని ఏటీడీఓ దేశిరాంనాయక్ అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం పద్మ అధ్యక్షతన సేఫ్టీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సేఫ్టీ ఆహారంపై నిర్వహించిన ఒక రోజు ప్రొగ్రాం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బాలికలను ఎవరైనా వేధించినా, తాకకూడని చోట తాకినట్లయితే భయపడకుండా ఎదురించే విధంగా విద్యార్థినులకు అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థినులు 1098 నంబర్‌కు కాల్ చేసి, ఫిర్యాదు చేయాలని, అంతకంటే ముందుకు ఇంట్లోని తల్లిదండ్రులకు తెలియజేయాలని చెప్పారు. విద్యార్థినులకు భోజనం తయారు చేసేముందు వంట పాత్రలు శుభ్రంగా చేసి, పరిశుభ్రమైన కూరగాయలుతో వంటలు వండాలని, వర్కర్లు శుభ్రత పాటిస్తూ వంటలు వండాలని సూచించారు. విద్యార్థినులకు వేడి ఆహారాన్ని వడ్డించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి యాలం ఆదినారాయణ, మంగపేట, ఏటూరునాగారం, తాడ్వాయి, గోవిందరావుపేట మండలాల వార్డెన్లు, మోకాళ్ల లక్ష్మి, శ్రీలత, మనోజ్, లింగయ్య, రాజు, గొంది రాంచందర్, ప్రిన్సిపాల్ సుహాసిని, సిబ్బంది పాల్గొన్నారు.

పసుపు ఉత్పత్తిలో మనమే ఫస్ట్
కాజీపేటలో భారత్ గౌరవ్ టూరిస్ట్ ట్రైన్ సందడి
సాంస్కృతిక ప్రదర్శనతో సృజనాత్మక శక్తులు
- వివరాలు 10లో▸

# ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీఓ అంకిత్

- వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్ష
- ఐటీడీఏ పీఓ అంకిత్



సమావేశానికి హాజరైన అధికారులు, సిబ్బంది

ఏటూరునాగారం: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పీఓ మాట్లాడారు. గర్భవతుల మొదటి ట్రిమిస్టర్ రిజిస్ట్రేషన్ త్వరగా పూర్తి చేయాలని, ఐఎఫ్ఏ టాబ్లెట్ వినియోగం పెంచాలన్నారు. అర్హులైన గర్భవతులకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్స్ అందించాలన్నారు. ఈడీడీ గర్భవతులకు బర్త్ ప్లానింగ్ చేసి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం అయ్యేవిధంగా చూడాలన్నారు. పిల్లలకు టీకాల కార్యక్రమం పురోగతిలో ఉండాలని చెప్పారు. గర్భవతులు, పిల్లలకు అందుతున్న సేవలు, కేసీఆర్ కిట్స్ ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. వైద్యాధికారులు సబ్ సెంటర్ల వారీగా క్షేత్రస్థాయి సిబ్బందితో వైద్యసేవలపై సమీక్షలు నిర్వహించాలని తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమం ప్రజలందరూ వినియోగించుకునేలా చూడాలన్నారు. టీబీ వ్యాధి నోటిఫికేషన్ పెంచాలని వ్యాధి గ్రస్తులకు పోషణ సంబంధించిన లబ్ధి అందించాలని పీఓ కోరారు. అసంక్రమిత వ్యాధులు, డయాబెటిస్, హైపోటెన్షన్ పరీక్షలు చేసి మందులు అందించాలన్నారు. గిరిజన విద్యాసంస్థలలో విద్యార్థులకు సైకియాట్రిక్ సేవలు అందించాలని వెల్లడించారు.

**ఏజెన్సీ గ్రామాల్లో వైద్య శిబిరాలు పెట్టాలి**

ఏజెన్సీ గ్రామాల్లో మాతశిశు సంరక్షణ, ఎపిడమిక్ టీం సభ్యులు వైద్య శిబిరాలను నిర్వహించాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. వైద్య సిబ్బంది అందరూ ములుగు వెలుగు అటెండెన్స్ యాప్‌లో క్రమంగా హాజరు వేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ క్రాంతికుమార్, డాక్టర్ భానోతు పవన్‌కుమార్, వైద్యాధికారులు నిఖిల్, సుమలత రణధీర్, మహేందర్, మౌనిక, మధు, ప్రసాద్, శ్రీకాంత్, ప్రసాద్, సుకుమార్, స్వప్నిత, యమున, సాయినాథ్, దేవేందర్, అఖిల, ప్రోగ్రాం మేనేజర్ మహేందర్, స్టాఫ్ నర్సులు రజిత, మమత, వసంత, రేవతి, పుష్పలత పాల్గొన్నారు.

**ఐటీడీఏ ఉద్యోగులకు నోటీసులు**

ఐటీడీఏ కార్యాలయంలోని ఆయా సెక్షార్ విభాగాలను ఐటీడీఏ పీఓ అంకిత్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఐటీడీఏ కార్యాలయంలో ఐటీడీఏ సెక్షన్‌లో నలుగురు ఉద్యోగులు, ఐటీడీఏ డీడీ విభాగంలో ఇద్దరు, ఐటీడీఏ ఇంజనీరింగ్ విభాగంలో ముగ్గురు ఉద్యోగులు గైర్హాజరయ్యారు. ఉదయం 10.45 నిమిషాలు అవుతున్నప్పటికీ కార్యాలయంలో పై 9 మంది ఉద్యోగులు విధులకు హాజరు కాకపోవడంతో పీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులకు ఎందుకు రాలేదని సంజాయిషీ లేఖను రాయాలని, ఆదివారం విధులకు హాజరు కావాలని సర్క్యులర్ జారీ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా టూర్‌కు వెళితే టూర్ డైరీలో నమోదు చేయాలని ఆదేశించారు.

## సర్పంచ్‌పై టోల్ ప్లాజా సిబ్బంది దాడి

- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు.. ఇరువురిపై కేసు నమోదు
- అరగంట పాటు వీక్షించినా పని చేయని ఫాస్టాగ్
- ఇదేంటని అడిగినందుకు దాడి

**రఘునాథపల్లి:** మండలంలోని కోమల్ల టోల్‌ప్లాజా సిబ్బంది ఆగడాలు రోజురోజుకు మితిమీరుతున్నాయి. సాంకేతిక కారణాలతో ఫాస్టాగ్ పని చేయని సమయంలో వాహనదారులకు సర్ది చెప్పాల్సిన సిబ్బంది, వారిపై దాడులకు దిగుతున్నారు. గతంలోనూ అనేక గొడవలు జరిగాయి. తాజాగా శుక్రవారం రాత్రి ఏకంగా సర్పంచ్, ఆయన బంధువులపై అక్కడి సిబ్బంది దాడికి దిగారు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్ వీరేందర్ తెలిపారు. మండలంలోని ఖిలాషాపూర్ సర్పంచ్ ముప్పిడి శ్రీధర్ శుక్రవారం మధ్యాహ్నం తన టీఎస్ 03 ఈపీ1500 నంబర్ కారులో వివాహానికి హాజరయ్యేందుకు బంధువులతో కలిసి హనుమకొండకు వెళ్లారు. నిత్యం ఆ మార్గంలో రాకపోకలు సాగించే అతను రూ.315తో నెల పాస్ తీసుకున్నాడు. అక్కడ ఆర్ఎఫ్ఐడి రీడ్ చేయకపోవడంతో ఫాస్టాగ్‌లో రూ.200 రీచార్జ్ చేసుకొని వెళ్లాడు. రాత్రి తిరిగి వస్తుండగా టోల్ ప్లాజా వద్ద మళ్లీ పాస్ పని చేయకపోవడంతో మరో రూ.200 ఫాస్టాగ్ రీచార్జ్ చేశాడు. 15 నిముషాల సమయం పడుతుందని సిబ్బంది చెప్పడంతో వెనక్కి వెళ్లిన ఆయన 20 నిముషాల పాటు వేచి చూశాడు. తిరిగి వెళ్లగా అప్పుడూ ఫాస్టాగ్ పని చేయలేదు. దీంతో నెల పాస్ పనిచేయదు. ఫాస్టాగ్ పని చేయదు ఇక్కడ ఎంత సమయం వేచి చూడాలని సర్పంచ్ ప్రశ్నించారు. ఈ క్రమంలో టోల్‌ప్లాజా సిబ్బంది సర్పంచ్‌తో పాటు ఆయన బంధువులపై దాడికి దిగారు. దీంతో సర్పంచ్ రఘునాథపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దాడికి పాల్పడిన టోల్ సిబ్బంది రాజనీష్, శ్రవణ్‌లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా టోల్‌ప్లాజా సిబ్బంది తీరుపై వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



# అనాథలను కదిలిస్తే కన్నీళ్లే..!



- ఆదరణలేని వృద్ధులకు ఆశ్రయం
- అనాథ ఆశ్రమం ఓ దేవాలయం
- మేమున్నామంటూ అమ్మలా ఆదరిస్తున్న 'ఎలగందుల' వృద్ధాశ్రమం

**ఖిలావరంగల్:** నా అనే వాళ్లు లేక కొందరు.. ఉన్నా పట్టించుకోని వారు మరికొందరు.. కారణమేదైనా జీవితం చివరి దశలో పండుటాకులు ఆదరణ కోల్పోయి ఆశ్రమంలో కాలం వెళ్లదీస్తున్నారు. మానవసేవే మాధవ సేవగా భావిస్తూ అనాథలను అమ్మలా ఆదరిస్తూ సమాజ నిరాదరణ, కుటుంబ సభ్యుల నిర్లక్ష్యానికిలోనై నిస్సహాయ స్థితిలో ఉన్న వారిని అక్కున చేర్చుకుని ఆశ్రయం కల్పిస్తోంది. చివరికి చనిపోయాక కూడా దహన సంస్కారాలు నిర్వహిస్తుంది ఖిలావరంగల్ మండలంలోని రాంగోపాలపురంలోని ఎలగందుల అమృత స్మారక వృద్ధాశ్రమం. జిల్లాలోని సరస్వతీ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఎలగందుల లక్ష్మీనారాయణ ఎవరూలేని అనాథలతో పాటు కొడుకులు, కూతుర్లు చీదరించుకున్న తల్లిదండ్రులను ఆదరిస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు. తల్లిలా లాలిస్తూ.. తండ్రిలా ఆదరిస్తూ.. కుటుంబ సభ్యుల్లా పలకరిస్తూ అనాథల కన్నీళ్లను తుడుస్తూ ముందుకు సాగుతున్నాడు.



మాట్లాడుతున్న నిర్వాహకుడు ఎలగందుల లక్ష్మీనారాయణ



ఆశ్రమంలో సేద తీరుతున్న వృద్ధులు..

**ఆలోచన ఎలా వచ్చింది..**

ఉపాధ్యాయ వృత్తిలో రిటైరయ్యాను.. సేవ చేయాలనే ఆలోచనతో 1999లో ఎలగందుల అమృత స్మారకార్థం ఆశ్రమం స్థాపించానంటున్నారు ఆశ్రమ వ్యవస్థాపక నిర్వాహకులు ఎలగందుల లక్ష్మీనారాయణ. హెడ్ మాస్టర్‌గా రిటైర్డు అయిన తర్వాత సుమారు 1000 గజాల స్థలంలో రాంగోపాల్‌పురం గ్రామ సమీపంలో ఆశ్రమం నిర్మాణానికి నడుంబిగించాను. నిధుల లేమితో కొన్ని ఇబ్బందులు పడ్డాను. దాతల సహకారంతో అనుకున్న పనిని విజయవంతంగా కొనసాగిస్తున్నాను.

**చనిపోయిన వారికి దహన సంస్కారాలు సైతం..**

ఆశ్రమంలో చేరినప్పటి నుంచి చివరి వరకు ఉండి ఆ తర్వాత చనిపోయిన వృద్ధులకు దహన సంస్కారాలు ఆశ్రమ నిర్వాహకులే నిర్వహించడం విశేషం. ఒకసారి ఆశ్రమంలో చేరాక మా కుటుంబ సభ్యుల లాగే మేం భావిస్తామని, ఎవరైనా వృద్ధులు చనిపోతే మా ఇంట్లో సభ్యుడు చనిపోయిన విధంగా భావిస్తామని చెబుతున్నారు ఆశ్రమ నిర్వాహకులు.

### ప్రభుత్వం సహకరిస్తే సేవలు విస్తరిస్తా..



నేను 70 ఏళ్ల వృద్ధుడిని..నాతోటి వృద్ధులకు చేరదీసి ఆకలి తీర్చాలన్నదే నాకోరిక. నాకు చిన్నప్పటి నుంచి సేవ చేయాలనే భావన ఉండేది. వృద్ధులు అంటే చీదరించుకునే వారు చాలామంది ఉన్నారు. నాకు చేతనైనంత సహాయం చేయడమే నాకు సంతృప్తి. ప్రభుత్వం సహకరిస్తే ఆదరణ కోల్పోయిన వారికి మరింత మందికి ఆశ్రయం కల్పిస్తాం.

– లక్ష్మీనారాయణ ఆశ్రమ చైర్మన్

### నాకు ఎవరూ లేరనే బాధ లేదు



ఈ ఆశ్రమంలో చేరినప్పటి నుంచి నాకు ఎవరూ లేరనే బాధ లేదు.నాకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు బిడ్డలు ఉన్నారు. ఒక కొడుకు లోకానికి దూరమయ్యాడు. బిడ్డలు పట్టించుకోరూ. మనవళ్ల ప్రేమకు దూరం చేశారు. నన్ను మా మనవడు ఆశ్రమంలో ఉంచాడు. ఇక్కడివాళ్లు కుటుంబ సభ్యుల్లా చూసుకుంటున్నారు. నాకు ఏ లోటు లేదు.

– జ్యోతి యాకమ్మ, వృద్ధురాలు

### ఆరేళ్ల నుంచి ఇక్కడే ఉంటున్నా..



బస్సు ప్రమాదంలో రెండు కాళ్లు పోయాయి. నా భార్య అనారోగ్యంతో మృతి చెందింది. నాకు ఏకైక కుమార్తె ఉన్నా.. నా కాళ్లు పోగానే నన్ను చీదరించుకుని నేరుగా నన్ను ఆశ్రమంలో వదిలేసి వెళ్లింది. నా అత్త దేవత నాకు ఆర్థికసాయం చేస్తోంది. ఇక్కడి వారే నా బిడ్డలు తల్లిదండ్రులుగా భావిస్తున్నా.

– తాదూరి వేణుగోపాల్

## పీఏసీఎస్ చైర్మన్‌పై దాడి

**హసన్‌పర్తి:** మండలంలోని వంగపహాడ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ మేర్గు రాజేష్‌పై దాడి జరిగిన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. వ్యక్తిగత పనులు ముగించుకుని బైక్‌పై రాజేష్ ఇంటికి బయల్దేరగా మార్గమధ్యలో ముగ్గురు వ్యక్తులు అడ్డంగా వచ్చి బైక్‌ను కాళ్లతో బలంగా కొట్టారు. ఈ సంఘటనలో రాజేష్ కిందపడడంతో బలమైన గాయాలయ్యాయి. మారణాయుధాలు ఉన్నట్లు గమనించిన రాజేష్ వారి నుంచి తప్పించుకున్నాడు. గమనించిన ఇద్దరు యువకులు కేకలు వేయడంతో వారు పరారయ్యారు.

**పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు...**

హసన్‌పర్తికి చెందిన రాకేష్, నితిన్, కన్నయ్య దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈఘటనలపై దర్యాప్తుచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**నాలుగు నెలలుగానే...**

ఇదిలా ఉండగా నాలుగు నెలలుగా రాజేష్‌పై దాడికి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిసింది. రెండు నెలల క్రితం దామెర సమీపంలో రాజేష్‌పై దాడి చేయడానికి యత్నించారని స్థానికంగా చర్చ జరుగుతోంది.

## డిటోనేటర్ల కలకలం

- మేకల కాపరి ఇచ్చిన సమాచారంతో పోలీసుల అప్రమత్తం
- బాంబుస్క్వాడ్ తనిఖీల్లో బయటపడ్డ 500 డిటోనేటర్లు

**బయ్యారం:** మండలకేంద్రంలో శనివారం రాత్రి పోలీసులకు పట్టుబడ్డ ఎలక్ట్రిక్ డిటోనేటర్లు స్థానికంగా కలకలం రేపాయి. వివరాలు ఇలా ఉన్నాయి. బయ్యారంలోని వ్యవసాయశాఖ కార్యాలయం వెనుకభాగంలో ఉన్న ఖాళీ స్థలంలో ఒక గోనె సంచిలో ఎలక్ట్రిక్ డిటోనేటర్లు (మందుగుండు సామాగ్రి) ను మేకలకాపరి గుర్తించాడు. ఈ విషయాన్ని పోలీసులకు తెలిపాడు. వెంటనే ప్రాంతానికి చేరుకున్న గార్ల-బయ్యారం సీఐ బాలాజీ, ఎస్సై రమాదేవి సోదాలు నిర్వహించి బాంబుస్క్వాడ్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఆ బృందం ఆ ప్రాంతానికి చేరుకొని పాత గోనెసంచిలో ఉన్న డిటోనేటర్లను స్వాధీనపర్చుకొని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు.

**జనావాసాల మధ్యకు ఎలా వచ్చాయి...?**

పోలీస్‌స్టేషన్‌కు అరకిలోమీటర్ దూరంలో జనావాసాలు ఉండే ప్రాంతంలోకి పేలుడుకు ఉపయోగించే డిటోనేటర్లు ఎలా వచ్చాయి అనే ప్రశ్నలు పలువురిలో వ్యక్తమవుతున్నాయి. డిటోనేటర్లు లభ్యమైన బస్తాను బట్టి చూస్తే చాలా ఏళ్ల క్రితం వీటిని అక్కడ వదిలివెళ్లినట్టు ప్రాథమికంగా తెలుస్తోంది. డిటోనేటర్లను కంప్రెషర్‌బండ్ల నిర్వాహకులు పెట్టారా లేక గతంలో మండలంలో ప్రాబల్యం ఉన్న నక్సల్స్ గ్రూపులు పెట్టారా అనే విషయం విచారణలో తేలాల్సి ఉంది. ఈ విషయంపై సీఐ బాలాజీని వివరణ కోరగా డిటోనేటర్లు లభ్యమైన విషయం వాస్తవమేనని ఈ డిటోనేటర్లను ఎవరు పెట్టారు అనే విషయంపై విచారణ నిర్వహిస్తామన్నారు.

## నెక్కొండలో మద్యం పట్టివేత

**నెక్కొండ:** అక్రమ మద్యంను స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్టు చేసిన సంఘటన స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. సీఐ హథీరాం నాయక్ తెలిపిన వివరాలు... రైలు ద్వారా అక్రమ మద్యం దందాకు పాల్పడుతుండగా పక్కా సమాచారం మేరకు స్థానిక రైల్వే స్టేషన్‌లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. తనిఖీలో భాగంగా అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తిని అతని వద్ద ఉన్న బ్యాగులను పోలీసులు సోదా చేశారు. భూపాలపల్లి జిల్లా మహాముత్తారం గ్రామానికి చెందిన మహ్మద్ మెహబూబ్‌పాష, అతని కుమారుడు మహ్మద్ రఫీ మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యంను రైళ్ల ద్వారా తెలంగాణ రాష్ట్రానికి తీసుకొచ్చి విక్రయానికి పాల్పడుతున్నట్లు తేలిందని సీఐ పేర్కొన్నారు. మెహబూబ్‌పాషను అరెస్టు చేశామని, రఫీ పరారీలో ఉన్నట్లు చెప్పారు. వీరి నుంచి సిగ్నేచర్ ఫుల్ బాటిళ్లు 47, ఆర్‌సీ ఫుల్ బాటిళ్లు 12, వీటి విలువ సుమారు రూ. 73,305 ఉంటుందన్నారు. కార్యక్రమంలో నర్సంపేట ఎక్సైజ్ ఎస్సై రాజేశ్వరీ, పోలీసులు, పాల్గొన్నారు.

## ప్రేమ పేరుతో మోసం

- గర్భవతిని చేసి మరో యువతితో వివాహం
- యువకుడి మోసంపై పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు

**పాలకుర్తి టౌన్:** ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని యువతిని లొంగదీసుకున్నాడు. గర్భవతిని చేసి అందరికి తెలిస్తే అసలుకే మోసం వస్తుందని గ్రహించి బలవంతగా అబార్షన్ చేయించాడు. అవసరం తీరాక మరో యువతిని వివాహం ఆడడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించిది. ఈ ఘటనపై స్థానిక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. పాలకుర్తి మండలం శాతాపురం గ్రామానికి చెందిన లకావత్ వినోద్ జనగామ డిగ్రీ చదువుతున్న సమయంలో లింగాలఘణపురం మండలంలోని చీటూరు గ్రామానికి చెందిన రీణాతో పరిచయమైంది. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని వినోద్ నమ్మబలికి ఇద్దరు శారీరక బంధానికి కారణమైంది. దీంతో ఆ యువతి గర్భం దాల్చింది. ఎన్నిసార్లు పెళ్లి విషయం అడిగినా సదరు యువకుడు మొహం చాటేశాడు. ఇటీవల గుట్టుచప్పుడు కాకుండా మరో యువతిని వివాహం చేసుకున్నాడు. పెళ్లి విషయం ప్రేమికురాలికి తెలియగా అడుగుదామని ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. చివరికి యువకుడు పారిపోయాడు. శనివారం శాతాపురం గ్రామానికి వచ్చిన యువతి ప్రేమించి మోసం చేసిన యువకుడి ఇంటికి వెళ్లగా ఆ యువకుడి అక్క, బావ ఇద్దరు ఆ యువతిపై దాడికి పాల్పడ్డారు. స్థానికుల సహాయంతో పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో యువతికి చికిత్స అందించారు. ప్రేమంచి పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వినోద్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసింది. రీణా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తాళ్ల శ్రీకాంత్ తెలిపారు.



పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు రీణా

## జీవితంపై విరక్తి చెంది యువకుడి ఆత్మహత్య



జనార్ధన్ మృతదేహం

**సంగెం :** మద్యానికి బానిసైన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని తిమ్మాపూర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా కటంగూర్ మండలం చెరువు అన్నారం గ్రామానికి చెందిన వరికుప్పల ఇస్తారి భార్య పిల్లలతో కలిసి వచ్చి ఏడేళ్లుగా తిమ్మాపూర్‌లో ఉంటూ బావులు పూడికతీస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇస్తారి కుమారుడు జనార్ధన్ (22) నాలుగేళ్ల క్రితం ఎల్గూర్‌రంగంపేటకు చెందిన అనూషను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు సంతానం. ఇటీవల జనార్ధన్ తాగుడుకు బానిసయ్యాడు. శనివారం బాలునాయక్ తండాలో బావిపూడికకు తల్లిదండ్రులతో కలిసి వెళ్లిన అతను పనిచేయకుండా ఇంటికి తిరిగివచ్చాడు. భార్య అనూష బట్టలు ఉతికి సాయంత్రం వెళ్లి చూడగా లోపల గొళ్లెం పెట్టి ఉంది. అనుమానం వచ్చి చుట్టుపక్కల వారు నరేష్, రాజులను పిలువగా తలుపులు తెరిచేసరికి ఉరేసుకొని మృతి చెంది ఉన్నాడు. మద్యానికి బానిసైన జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడినట్లు తండ్రి ఇస్తారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భరత్ తెలిపారు.

## పెళ్లి ఇంట విషాదం

- గుండెపోటుతో వధువు తల్లి మృతి
- శోక సంద్రంలో ఇరు కుటుంబాలు



స్వరూప (ఫైల్)

**బచ్చన్నపేట :** అమ్మాయి, అబ్బాయి తరుపున వారందరూ కలిసి శుక్రవారం మండలంలోని శ్రీనిధి గార్డెన్‌లో వైభవంగా వివాహాన్ని జరిపించారు. రాత్రివేళ బరాత్ తీసి అమ్మాయి, అబ్బాయిని ఇంటిలోకి సాగనంపిన అనంతరం అమ్మాయి తల్లి శనివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందింది. దీంతో ఇరు కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. మండలంలోని కేసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన జక్కుల కనుకమ్మ, అయ్యాలం దంపతుల కుమారుడికి సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం మర్మాముల శివారు బంజేరుకు చెందిన జంగిలి స్వరూప (35), మల్లేశం దంపతుల కూతురు మౌనికను ఇచ్చి పెళ్లి జరిపించారు. శనివారం పదహారు పండుగ జరుపుకునే క్రమంలో అందరూ బీజీగా ఉండగా పెళ్లి కూతురు తల్లి స్వరూప ఉదయం మోహం కడుక్కుంటూ కుప్పకూలింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పెళ్లి ఇంట్లో అశుభం జరుగడంతో వచ్చిన బంధువులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతురాలికి పెళ్లి కావల్సిన మరో ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



పెళ్లిలో అల్లుడు, కుమార్తెతో స్వరూప (కుడి వైపు నుంచి రెండో వ్యక్తి)

## వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి



చందు(ఫైల్)

**వర్ధన్నపేట :** బైక్‌పై వెళ్తున్న యువకుడికి రోడ్డుపై పంది అడ్డురావడంతో దానిని తప్పించబోయి కిందపడడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి పట్టణంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై రామారావు కథనం ప్రకారం.. వరంగల్ పోచమ్మమైదాన్‌కు చెందిన తాళ్లపెల్లి చందు(21) హన్మకొండలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో డిగ్రీ సెకండియర్ చదువుతున్నాడు. శుక్రవారం కళాశాలలో సిల్వర్ జూబ్లీ వేడుకలను పురస్కరించుకుని తన బైక్‌పై ఇంజనీరింగ్ కళాశాలకు చేరుకుని తన స్నేహితుడైన సత్తు దిలీప్‌తో కలిసి వెళ్లాడు. అక్కడి నుంచి తన అమ్మమ్మ గ్రామమైన జనగాం జిల్లా జఫర్‌ఘడ్ మండలం తమ్మడపెల్లి(జి) గ్రామానికి రాత్రి చేరుకుని తిరిగి అదే రాత్రి తన స్నేహితుడు దిలీప్‌తో కలిసి బైక్‌పై వస్తుండగా వర్ధన్నపేట పిరంగిగడ్డ ప్రాంతంలో రోడ్డుపై పంది వచ్చింది. దానిని తప్పించబోయి కిందపడడంతో చందు తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్నేహితుడు దిలీప్‌కు గాయాలు కాగా అతడిని చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మృతుడు తండ్రి పూర్ణచందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**బైక్ అదుపు తప్పి వ్యక్తి..**

**వరంగల్ (పర్వతగిరి):** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం చింతనెక్కొండ గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. జనగామ జిల్లా జఫర్‌ఘడ్ మండలం తమ్మడపల్లి(ఐ) గ్రామానికి చెందిన మాచర్ల సిద్దార్థ(22) నెక్కొండ మండలం రెడ్లవాడలోని ఓ శుభకార్యానికి వెళ్లాడు. శుభకార్యం పూర్తయిన తర్వాత తిరిగి స్వగ్రామానికి వస్తుండగా ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సిద్దార్థ తల్లి మాచర్ల అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై యాదగిరి తెలిపారు.



సిద్దార్థ మృతదేహం

**దీనగాథ**

సిద్దార్థ కుటుంబంలో తల్లి,తండ్రి వేరుగా ఉంటున్నారు. సిద్దార్థ ఎంబీఏ మొదటి సంవత్సరం మల్కాజిగిరిలో చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో మొదటి సెమిస్టర్ పరీక్షలు రాయడానికి వరంగల్‌లోని తన సోదరి ఇంటికి వచ్చి పరీక్షలు రాసి శుక్రవారం సాయంత్రం రెడ్లవాడలోని తన స్నేహితుడి శుభకార్యానికి హాజరై శనివారం తెలవారుజామున ఎవరికి తెలియకుండా ద్విచక్ర వాహనం వెళ్లాడు. చింతనెక్కొండ వద్ద బైక్ అదుపు తప్పి అక్కడికక్కడే మృతి చెందాడు.

**రోడ్డు ప్రమాదంలో డ్రైవర్..**

**కాజీపేట:** గ్రేటర్ పరిధిలోని 62వ డివిజన్ సోమిడి శివారులో శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బస్సు డ్రైవర్ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ధర్మసాగర్‌కు చెందిన ఎండీ.గౌస్ (45) మడికొండ రామస్ స్కూల్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పిల్లలను తీసుకుని కాజీపేటకు వస్తుండగా బస్సులో సాంకేతికలోపం తలెత్తడంతో ఆగిపోయింది. డ్రైవర్ కిందకు దిగి బస్సును మరమ్మతు చేస్తుండగా బస్సు ఆకస్మాత్తుగా ముందుకు కదలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని చేసి విచారణ చేపడుతున్నట్లు కాజీపేట పోలీసులు తెలిపారు.



మృతుడు ఎండీ.గౌస్ (ఫైల్)

**రైలు ఢీకొని వ్యక్తి..**

**డోర్నకల్ :** స్థానిక రైల్వే స్టేషన్‌లో శనివారం రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. జీఆర్పీ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక రైల్వే స్టేషన్ 4వ నంబర్ ప్లాట్‌ఫారం చివరన ఆర్ఆర్ఐ క్యాబిన్ ఎదుట రైలుపట్టాల ప్రక్కన మృతదేహం ఉందన్న సమాచారం మేరకు తమ సిబ్బంది ఘటనాస్థలానికి వెళ్లి స్థానికుల సహకారంతో మృతదేహాన్ని గుర్తించినట్లు తెలిపారు. మృతుడిని స్థానిక మెయిన్‌రోడ్డుకు చెందిన కాలా వినోద్‌కుమార్‌జైన్(63)గా గుర్తించినట్లు తెలిపారు. మృతుడు రాత్రివేళ పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెంది ఉంటాడని తెలిపారు. ఖమ్మంలోని అన్నం ఫౌండేషన్‌కు చెందిన అన్నం శ్రీనివాస్ ఘటనాస్థలానికి చేరుకుని తమ వాహనంలో మృతదేహాన్ని ఖమ్మంలోని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడు భార్యకు దూరంగా ఒంటరిగా ఉంటుండగా డోర్నకల్‌లో సమీప బంధువులు ఉన్నారు.